


కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో సభలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

# అమిత్ షా సభ అట్టర్ ఫ్లాప్

- సూర్యాపేటలో జనం లేని బీజేపీ సభ
- 30 వేలు అనుకుంటే 10 వేలు కూడా మించని జనం
- నాలుగు నియోజక వర్గాల నుంచి వచ్చినా ఖాళీ కుర్చీలే దర్శనం
- 12 నిమిషాలకే ప్రసంగం ముగించిన అమిత్ షా

సూర్యాపేట, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేటలో భారీ అంచనాలతో బీజేపీ నిర్వహించిన జన గర్జన సభ అట్టర్ ఫ్లాప్ అయింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరు కావడంతో భారీ అంచనా, వ్యయంతో ఏర్పాటు చేసిన సభ వెలవెలబోయింది. దాదాపు 30 వేల మంది జనం వస్తారని ఆ మేరకు కుర్చీలు ఏర్పాటు చేయగా వారి అంచనాలు తలకిందులై 10 వేలకు మించి రాలేదు. అసలే తక్కువ సంఖ్యలో జనం రాగా వారు సైతం అమిత్ షా ప్రసంగాన్ని ఆసాంతం వినకుండా బారికేడ్లను తొలగించుకుని మధ్యలోనే వెళ్లిపోవడం కనిపించింది. బీజేపీ కార్యకర్తలు కాసేపు ఉండాల్సిందిగా వేడుకున్నప్పటికీ వారు ఆగకుండా వెనుతిరిగి వెళ్లిపోయారు. జిల్లా వ్యాప్తంగా లారీల్లో జనాన్ని తరలించినా వేసిన కుర్చీలు ఖాళీగా కనిపించాయి. సూర్యాపేట బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు మొదలుకుని అమిత్ షా ప్రసంగిస్తున్న సమయాల్లో సభలో సింహభాగం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. ఖాళీ కూర్చిలకే తమ ప్రసంగాలను వినిపించిన పరిస్థితి. అమిత్ షా ప్రసంగం సైతం ఆకట్టుకోకపోవడంతో బీజేపీ శ్రేణులు నిరుత్సాహంతో కనిపించాయి. వాస్తవానికి అమిత్ షా ప్రసంగం 45 నిమిషాలు ఉండగా జనం లేకపోవడంతో 12 నిముషాల్లోనే ముగించి వెళ్లిపోయారు. జిల్లా వ్యాప్తంగా జనాన్ని తరలించినా 10 వేలకు మించకపోవడం పట్ల ఇలాంటి సభలు ఎందుకు పెడుతారని అగ్ర నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మొత్తం మీద ఈ ప్రాంతంలో బీజేపీకి పట్టు లేకపోగా అమిత్ షా లాంటి అగ్ర నాయకులు వస్తే ఏదో జరుగుతుందనుకున్న ఆ పార్టీ నేతలు జన గర్జన సభ ఫ్లాప్ కావడంతో తీవ్ర నిరుత్సాహానికి లోనవుతున్నారు.



లక్ష్మణ్‌నాయుడు పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

## మంత్రి జగదీశ్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ పాదయాత్ర

- ప్రారంభించిన ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

బొడ్రాయిబజార్, అక్టోబర్ 27 : మంత్రి జగదీశ్‌రెడ్డి హాట్రిక్ విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్‌ఎస్ నాయకుడు, మంత్రి అభిమాని సోమగాని లక్ష్మణ్ నాయుడు 11 రోజులు దుర్గామాత మాల ధరించి శుక్రవారం ఇరుముడితో విజయవాడ దుర్గమ్మ చెంతకు పాదయాత్రగా బయల్దేరాడు. పాదయాత్రను ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. మంత్రి గెలుపును కోరుతూ 140 కిలోమీటర్లు పాదయాత్ర చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సోమగాని వేణుగౌడ్, దేవరకొండ జనార్దన్, సోమగాని శైలజ, సాంబశివ, విజయలక్ష్మి, ప్రకాశ్, లింగస్వామి పాల్గొన్నారు.

# పల్లె ప్రగతితో మారిన ఖాశీగూడెం సబ్ స్టేషన్

- రూ.3 కోట్లతో గ్రామంలో అభివృద్ధి పనులు
- అడుగడుగునా సీసీ రోడ్లు
- ఇంటింటికీ మిషన్ భగీరథ నీళ్లు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



ఖాశీగూడెంలో వేసిన సీసీ రోడ్డు

ఆత్మకూర్(ఎస్), అక్టోబర్ 27 : గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మండలంలోని ఖాశీగూడెం సబ్‌స్టేషన్ గ్రామం నేడు స్వరాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతితో అన్ని వసతులను సమకూర్చుకుని సరికొత్తగా దర్శనమిస్తున్నది. అభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రతలో ప్రగతి పథంలో పరుగులు తీస్తున్నది. ఇప్పటికే కోట్ల రూపాయాలతో పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టారు. పల్లె ప్రకృతి వనం, కంపోస్ట్ యార్డు, వైకుంఠ ధామం, నర్సరీ, ఓవర్ హెడ్ ట్యాంక్‌లు, సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, చెత్త సేకరణకు ట్రాక్టర్ కొనుగోలు చేసి చెత్త రహిత గ్రామంగా తీర్చిదిదుతున్నారు. ట్యాంకర్ ద్వారా మొక్కలకు నీళ్లు పోసి పచ్చదనం పెంపొందిస్తున్నారు.



గ్రామంలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్

### గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు..

- రూ.25 లక్షలతో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రోడ్ల నిర్మాణం
- రూ.1.62 కోట్లతో ఆర్ అండ్ బి రోడ్లు
- రూ.10 లక్షలతో ఎస్‌డీఎఫ్ సీసీ రోడ్లు
- రూ.12.6 లక్షలతో వైకుంఠ ధామం
- రూ.24 వేలతో డంపింగ్ యార్డ్
- రూ.13 లక్షలతో మిషన్ కాకతీయ పనులు
- రూ.10 లక్షలతో విద్యుత్ శాఖ నిర్మాణాలు, పనులు
- రూ.21 లక్షలతో తెలంగాణకు హరిత హారం

### సంక్షేమ పథకాలు..

- ఆసరా ఫించన్లు 44 మందికి రూ.64.61 లక్షలు
- నలుగురికి రూ.4 లక్షలతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్
- 12 మందికి రూ.1.5 లక్షలతో కేసీఆర్ కిట్లు
- రైతు బంధు పథకంలో 969 మందికి రూ.1.41 కోట్లు పంపిణీ
- 72 మందికి రూ.34 లక్షలతో రైతు రుణ మాఫీ
- రూ.49 లక్షలతో 8 స్వయం సహాయక సంఘాలకు రుణాలు
- 40 మందికి రూ.4.8 లక్షలతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం
- షెడ్యూల్ తెగల కార్యచరణ ప్రణాళిక రుణాలు ఒక్కరికి రూ.1 లక్ష

### మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో గ్రామం అభివృద్ధి



పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా ఖాశీగూడెం సబ్‌స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. మంత్రి జగదీశ్‌రెడ్డి సహకారంతో గ్రామంలో అన్ని పనులు విడుతల వారీగా పూర్తిచేసుకుంటూ ముందుకు సాగుతున్నాం. కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల దశ మారింది. గ్రామంలో అన్ని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతున్నాం.

– బాదావత్ దర్జి, సర్పంచ్, ఖాశీగూడెం సబ్‌స్టేషన్

### గ్రామంలో అడుగడుగునా సీసీ రోడ్లు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడినంక పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామంలోని అన్ని వార్డులో సీసీ రోడ్లు వేసి అద్దంలా మార్చారు. గతంలో ఏ బజారు చూసినా బురద మయంగా ఉండేది. వానకాలం వచ్చిందంటే అడుగు తీసి అడుగు వేసే పరిస్థితి ఉండేది కాదు. మా గ్రామాన్ని అన్ని రంగాలో అభివృద్ధి చేసిన మంత్రి జగదీశ్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– ఎస్‌కె హుసేన్, గ్రామస్తుడు, ఖాశీగూడెం సబ్‌స్టేషన్

# నాటికి.. నేటికి తేడాను గమనించండి

- అభివృద్ధి చేసే వారిని ఆశీర్వదించండి
- మంత్రి సతీమణి గుంటకండ్ల సునీత



సూర్యాపేటటౌన్ : విద్యానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సతీమణి గుంటకండ్ల సునీత

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 27 : సూర్యాపేటలో 2014కు ముందు తర్వాత అభివృద్ధిలో జరిగిన మార్పును ప్రజలు గమనించి పనిచేసే వారికే పట్టం కట్టాలని మంత్రి సతీమణి గుంటకండ్ల సునీతాజగదీశ్‌రెడ్డి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో రెండో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలోనే సీఎం కేసీఆర్ వంటి పాలన అందించే నాయకుడు మరొకరు లేరన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో మంత్రి జగదీశ్‌రెడ్డి పాలనలో సూర్యాపేట సుభిక్షంగా మారిన విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రంగారెడ్డి, మీలా వంశీ, సల్మా మస్తాన్, కరుణశ్రీ, రమణ, పావని. పద్మ, నాగమణి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

### మంత్రి జగదీశ్‌రెడ్డి పాలనలో ప్రశాంత వాతావరణం..

సూర్యాపేట రూరల్ : పదేండ్లుగా మంత్రి జగదీశ్‌రెడ్డి పాలనలో సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని ఇదే వాతావరణం కొనసాగేలా అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మండలంలోని ఎండ్లపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కుంట్ల సుదర్శన్‌రెడ్డి, ఉయ్యాల రవి, కుంట్ల భీష్మారెడ్డి, జానయ్య, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

### మ్యానిఫెస్టోతో ప్రజలందరికీ భరోసా..

బొడ్రాయిబజార్ : బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టో ప్రజలందరికీ భరోసానిస్తుందని మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యురాలు బత్తుల ఝాన్సీ అన్నారు. పట్టణంలోని 43వ వార్డులో ఇంటింటికీ తిరుగుతూ పార్టీ మ్యానిఫెస్టోను వివరించి కారు గుర్తుకు ఓటు వేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని కోరారు.



బొడ్రాయిబజార్ : 43వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సూర్యాపేటరూరల్ : ఎండ్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ భిక్షం